దాసుకి ఆశ్చర్యంగావుంది. అతనాడిన అబద్ధంలో ఒక విధమైన రహస్యానందంవుంది. తన జీవితంలోని మోహాన్ని తనంతతాను నిరాకరించి కప్పిపుచ్చాడు. తను సరోజకి వ్రాసిన ఉత్తరాల గురించి నరసింహానికి చెప్పాడుగాని అంత స్పష్టంగా చెప్పలేదు. అతని హృదయం వేగంగా కొట్టుకోవడం మానేసింది. తాను ఆమెకు ఏమి వ్రాశాడో వాటి ప్రసక్తి దూరంగా వుంచాడు. అతని కా సమయంలో ఆమెకేం రాశాడో సరిగా జ్ఞాపకంగూడా లేదు.

నరసింహం ఏమీ అనుమానించలేదు. అతను చిన్నపిల్లాడిలా ఆనందిస్తున్నాడు. సరోజగురించి గొప్పగా మాట్లాడాడు. ఆమెను సుఖపెడతానని వాగ్దానంగూడా చేశాడు, ఆమెతో ఎలా ఆనందించబోతాడో, ఎలా కాలంగడుపుతాడో అదికూడా ఊహించి చెప్పాడు. రాబోయే రోజులు ఎంత ఆనందంగా గడుపుతాడో వాటి గురించి ఉత్సాహంగా చెప్పాడు.

రామదాసు చిరునవ్వు నవ్వుతూ విన్నాడు. తాను త్యాగం చూపించే అంత్యసమయంలో అక్కడ వుండటానికి తగిన ధైర్యం వుండదేమోనని భయపడ్డాడు. కొంతసేపు యిద్దరూ మాట్లాడుకున్న తర్వాత నరసింహంతో యిలా అన్నాడు:

“ఇప్పుడన్ని ఏర్పాట్లూ జరిగిపోయాయి గాబట్టి నేను వెళ్ళి విశ్రాంతి తీసుకుంటాను. నేను వెంటనే వెళ్ళిపోతాను.” నరసింహం తన ఆనందంలో పాల్గొనకుండా అతను వెళ్ళిపోవడమా అని అడ్డుచెప్పబోయాడు.

“వొద్దు-నేనొక అంతరాయం మీకు, ప్రేమికులు ఒంటరిగా ఉండాలనుకుంటారు, నన్ను వెళ్ళనియ్యి. మీరువచ్చి ఒకసారి నన్ను చూడాలి.” అన్నాడు దాసు.

మర్నాడు అతను వెళ్ళిపోయాడు. అతని హృదయంలో బాగా నీరసం ఏర్పడింది. మృత్యువును సమీపించే వారు మాత్రమే పొందగలిగే ఆ ప్రశాంతతలో అతను క్షీణించి పోతున్నాడు.

(వచ్చేసంచికతో ఆఖరు)

కథానిక

అప్రయోజకుడు

వి. వి. సూర్యనారాయణ

ఆనందించడానికి నోచుకున్న అదృష్టవంతులు మొదటాట సినిమా చూసి యింటికి పోయే సమయం అదే. రోజంతా అమ్మకం వల్ల వచ్చిన ధనాన్ని లెక్కచూచుకొని లాభనష్టాలు బేరీజు వేసికొనే షాపుకార్లు డబ్బుని యినప్పెట్టెల్లో బిగించి దుకాణాలు మూసే సమయమూ అదే. పగలంతా ఆఫీసులో చేసిన పని చాలక, యింటివద్ద కూడా వ్రాయడానికి గాడిద బరువు కాగితాలను మోసుకొని, అరిగిపోయిన అతుకు చెప్పుల్ని యీడ్చుకుంటూ హృదయభారంతో ప్రకాశరావు రోజూ బసకు చేరుకునే సమయమూ అదే. ఆఫీసులో పని చేయవలసిన నియమితకాలం పదకొండు గంటల నుండి సాయంత్రం అయిదు గంటల వరకే. కాని, తెల్లవారేసరికి, అతడలా నోట్లో కాఫీనీళ్ళు పోసుకుని యిలా ఆఫీసు చేరుకోవాలి. వెళ్ళిన తర్వాత రాత్రి తొమ్మిదీ అయ్యేవరకూ కదలడానికి అవకాశం లేదు. ఇది వాళ్ళ యజమాని చేసిన ప్రతిసృష్టి. తను గుమాస్తాగా జీవనం సాగించదల్చుకొన్నన్నాళ్ళు అధికారుల అధీనంలో బానిసలాగా ఉండక తప్పదు.

ప్రకాశరావు జీవితము ఒక విధంగా యీ రకమైన బానిసత్వానికి అంకితమైపోయిందంటే దానికి తనెంతవరకూ బాధ్యుడో తనకే తెలియదు. తనూ చదువుకొనే సమయంలో, ఆశయాలూ ఆవేశాలూ గలవాడే. తన తండ్రి

గుమాస్తాగా ఎంతవరకూ సుఖపడ్డాడో తనకు తెలుసు. అధికార్ల నిరంకుశత్వానికి తన తండ్రి ఆత్మ ఎంతగా క్షోభించిందో తనకు ప్రత్యక్ష నిదర్శనమే! వేరే తెరువు లేనప్పుడు వ్యక్తిత్వాన్ని చంపుకొనే గుమాస్తాగా బానిసత్వం అనుభవించేకన్న ఆత్మహత్య మేలని తనెన్నో సార్లు అనుకున్నాడు. తను పట్టభద్రుడై కాలేజీ ఆవరణ దాటివచ్చిన తర్వాత మానవసేవతో యేమాత్రమైనా సంబంధం గల జీవితాన్ని గడుపుదామని మనసారా కాంక్షించాడు. కాని యీనాడు తన వాంఛలన్నీ స్వాప్నికములే అయిపోయాయి. తానే రకమైన జీవితాన్ని హేయంగా పరిగణించేడో, ఎటువంటి వృత్తికి సాధ్యమైనంత దూరంగా ఉండాలనుకొన్నాడో, దాని గుప్పిట్లోనే చివరకు యిరుక్కుపోవలసిన అగత్యం కలిగింది. ఈ పరిణామానికి కారణం అతని అసామర్థ్యం కాకపోయినా, తన తండ్రి మాటకెదురాడలేని మనోదౌర్బల్యం అనిమాత్రం చెప్పాలి.

తను బి. ఎ. పరీక్ష రెండవ తరగతిలో ఉత్తీర్ణుడైనట్లు తెలిసిన రోజున తండ్రి అన్నాడు:

'అబ్బాయీ! ఇంతవరకూ ఎల్లాగో రెక్కల కష్టంమీద నిన్ను చదివించేనన్న సంగతి నీకు తెలుసును కదా. ఇకపైన చదివించగలిగే శక్తి కూడా నాకు లేదు. అందుచేత వెంటనే నువ్వేదైనా ఉద్యోగంలో ప్రవేశిస్తే మంచిది. అట్లా చేస్తే కుటుంబానికి కొంత భారం తగ్గినట్లూ ఉంటుంది. ఏమంటావ్?

'అలాగేలెండి నాన్నగారూ! ఏదైనా అనువైన ఉద్యోగం దొరికితే తప్పకుండా మీరు చెప్పినట్లే చేస్తాను.' అన్నాడు తను.

ఆ మాటమీద తండ్రి చేసిన కృషిఫలితంగా ప్రకాశరావుకి త్వరలోనే ఉద్యోగం లభించింది. బెజవాడలో ఒక ఆఫీసులో గుమాస్తా పని ఖాళీగా ఉందని తెలిసి, తనకు తెలిసిన ఒక స్నేహితుని ద్వారా అది ప్రకాశరావుకి వచ్చేటట్లు చేయగలిగేడు అతని తండ్రి. కాని తాను చేయబోయేది గుమాస్తాపని అని తెలియగానే ప్రకాశరావు నిర్మించుకొన్న ఆశాసౌధాలు ఒక్కసారి కూలిపోయాయి. 'ఇంతకాలమూ పెద్ద కబుర్లు చెప్ప యిప్పుడు బానిసత్వానికి దాసోహం చేస్తున్నావా?' అని అతని బుద్ధి హేళనచేసింది. 'అప్రమత్తులైన అధికారాంధుల అడుగుల క్రింద పడి నలిగిపోతావుసుమా!' అని ఆత్మ పరితపించింది. 'ఏ వృత్తినైనా స్వీకరించుకో, గుమాస్తాగా మాత్రం జీవితాన్ని స్థిరపరుచుకోవద్దు.' అని అతని యువక హృదయం ప్రతిఘటించింది.

ఆ ఉద్రేకంలోనే తండ్రిదగ్గరకు వెళ్ళి చెప్పేడు, తానా ఉద్యోగం చెయ్యడానికి అంగీకరించలేనని.

'ఏమోయ్! ఏమొచ్చిందా ఉద్యోగానికి? పిలిచి పిల్లనిస్తే యేదో అన్నాట్ట నీలాటివాడే.'

'ఈ పదవి స్వీకరించడం నా ఆశయాలకు విరుద్ధం నాన్నగారూ!'

'ఆశయాలట. ఆశయాలు! ఏమిటి నీ ఆశయాలు? మింగ మెతుకు లేదుగాని, మిసాలకు సంపెంగ నూనెట! ఈ చేతకాని కబుర్లు కట్టిపెట్టి ప్రయాణానికి సిద్ధంకా. ఎల్లుండే ప్రవేశించాలి పనిలో.'

'అదికాదు...'

'అది అవునో కాదో నాకు తెలుసులే. ఉద్యోగం చెయ్యకపోతే అడుక్కుని తింటావా యేం? దారి చూపించినప్పుడైనా నీ పొట్ట నువ్వు పట్టుకుని పోవాలిగాని, ఎన్నాళ్ళిలా వాళ్ళమీద వీళ్ళమీద ఆధారపడి ఉంటావు?' ఈ మాట ప్రకాశరావుకి హృదయంలోంచి దూసుకుపోయినట్లయింది. ఆమాటలు తన తండ్రి,—కన్నతండ్రి— నోటినుండి వచ్చినందు కాశ్చర్యపోయాడు. ఆ మాటే మరొకడంటే, అంతగా బాధపడి ఉండడేమో! తనను భరించడం ఎంత కష్టం కాకపోతే అలా అనగలడు తనతండ్రి.తన వ్యక్తిత్వం యికముందు అలాటి దూషణలకు తల ఒగ్గడానికి నిరాకరించింది. తత్ఫలితంగా అతనిప్పుడు ఆత్మాభిమానాన్ని చంపుకొన్న గుమాస్తా! తన అధికారి చేతిల్లో కీలుబొమ్మ!

ఆరోజు ప్రకాశరావు బసకుచేరుకొని తలుపు తియ్యగానే తలుపు సందులోంచి పోస్టుబంట్రోతు పడేసిన ఉత్తరం కనుపించింది. కవరు మీది వ్రాత అక్షరాలు చూడగానే తన తండ్రి దగ్గరనుండి అని తేలిసింది. కవరు చించకుండానే ఊహించుకున్నాడు, ఆ ఉత్తరంలో ఏ ముంటుందో! ఉత్తరంలో పంక్తులకూ, తన ఊహాకూ

తు. చ. తప్పకుండా జరిపోయింది. అందులో తన తండ్రి వ్రాసినదంతా నిజమే! తనను ప్రతి నెలా ముప్ఫయి రూపాయలకు తక్కువ కాకుండా యింటికి పంపమన్నాడంటే అట్లా అడగడానికి తన తండ్రికి సంపూర్ణమైన హక్కుంది. తమ రక్త మాంసాలోడ్చి బి. ఏ. వరకూ చదువు చెప్పించారే తన తల్లిదండ్రులు. ఆ కాలంలో వాళ్లు రెండు పూటలా భోజనమైనా చేశారో, లేదో! అటువంటప్పుడు అడిగించుకోకుండానే తనకై వాళ్లు చేసిన ఖర్చు వడ్డీతో సహా తీర్చవలసిన బాధ్యత తనయందుంది. తనకూ ఉద్యోగంలో చేరింది మొదలు శక్త్యానుసారం ప్రతి నెలా కొంత డబ్బు వెనకేసి యింటికి పంపాలనే ఉంది; కాని ఎప్పటికప్పుడే విఫలుడౌతున్నాడు. బెజవాడలాంటి బస్తీలో తనకు వచ్చే జీతం యింటద్దెకూ భోజనానికే సరిగా చాలదు. అందులోనే మిగిల్చి యింటికి పంపడమనేది సాధింపలేని సమస్యగా తోచింది, ప్రకాశరావుకి.

'ఉద్యోగం అన్నతర్వాత యింతో అంతో పైగా దొరుకుతుంది. అదీ జీతమూ కలిపి, అంతా నీషోకులకే వెచ్చం చేస్తే, యింకా ప్రయోజకులు కావలసిన నీ తమ్ముళ్లూ, పెళ్ళిళ్ళు కావలసిన నీ చెల్లెళ్లూ ఉన్నారు. వాళ్ళగతేం కావాలి? నిన్ను చదివించి ప్రయోజకుణ్ణి చేసినందుకు, కుటుంబానికి చేదోడుగా ఉంటావనుకొన్నాము. కాని యిట్లా వెడమొహం వెడతావనుకోలేదు.' ప్రకాశరావు పైని చదవలేకపోయాడు. కళ్లల్లో కన్నీటిపొరలు కమ్మేయి. ప్రకృతి అంతా అలుక్కుపోయినట్లు కనిపించింది. చదువుతూన్న లేఖ అప్రయత్నంగా చేతిలోంచి జారిపోయింది. తననుగురించి తండ్రి అర్థంలేని అపోహ పడుతున్నాడు. ఆయన చెప్పినట్లు, అవసరాన్ని వినియోగించుకునే ప్రజలను పీడించి డబ్బు వసూలు చేయడం అట్టే కష్టమైన పనికాదు. తోడి గుమాస్తాలు అట్లా సంపాదించడం తను రోజూ చూస్తూనే ఉన్నాడు. కాని అవిధమైన ధనార్జనకు ప్రకాశరావు మనస్సెంతమాత్రమూ మొగ్గలేదు. అందుచేతనే తన తోడి గుమాస్తాలతన్ని 'అప్రయోజకుడ'న్నారు. అదే మాట యీనాడు తన తండ్రికూడా అన్నాడు. కాని అతని హృదయం 'అప్రయోజకుడు' అనిపించుకున్నందుకు క్షోభించలేదు. చిన్నతనంనుండీ తన నడవడికను చూసి గుర్తెరిగిన తండ్రి యీనాడు కారణ రహితంగా తన్నుగూర్చి అపోహ పడ్డందుకతని మనస్సు అపరిమితంగా పరితపించింది. ఈ సంక్షోభానికి కారణం తండ్రి అడిగిన మొత్తాన్ని నెలనెలా పంపడానికి తాను అశక్తుడు కావడమే! ఇక ముందైనా ఆయన కోర్కెను సాధ్యమయినంతవరకూ నెరవేర్చాలి. ఐతే అది యెట్లా కొనసాగుతుంది? అన్యాయార్జితం పేరు చెప్తేనే భయపడి ఆమడదూరం పారిపోయే ప్రకాశరావు కదొక పెద్ద సమస్య అయిపోయింది.

ఈ పరిస్థితిలో, కాలేజీలో తన సహాధ్యాయుడుగా ఉండే వెంకట్రావు సలహా తనకు కొంతవరకూ ఉపయోగించిందని చెప్పాలి. బందర్లో బి. ఎల్. పాసయి బార్ కౌన్సిల్ లెక్చర్లకు మద్రాసు వెళ్తూన్న వెంకట్రావుని యథాలాపంగా కలుసుకున్నాడు ప్రకాశరావు. రెండు సంవత్సరాలుగా మిత్రులిద్దరూ ఒకరొన్నొకరు చూసుకోలేదు. గడచిన యీ రెండు సంవత్సరాల్లోనూ పత్రికాలోకంలో రచయితగా పేరు సంపాదించాడు వెంకట్రావు. అతని రచనల్ని చదివి తన్మయత్వం చెందిన వారిలో ప్రకాశరావొకడు. మిత్రుని రచనానైపుణ్యాన్ని చూచి, అవగాహన చేసికొని వినోదించిన వారిలో అతడు ప్రథముడు. 'బహు కాలానికి స్నేహితుణ్ణి చూసినందు కతని మనస్సానాడు చంద్రదర్శిత సాగరంలాగా ఉప్పొంగింది. మాటల సందర్భంలో ప్రకాశరావు పరిస్థితినర్థం చేసుకొన్నాడు వెంకట్రావు. తనకు తోచిన సలహాకూడా యివ్వకుండా ఉండలేకపోయాడు.

“ప్రకాశరావ్! నువ్వేమీ తెలివిమాలిన వాడవికావు. మన మిత్రబృందం అంతటిలోనూ ఎక్కువ సాహిత్య జ్ఞానం కలవాడవు. ప్రయత్నిస్తే నువ్వు సాధించలేని పని ఉండదేమో. నీలో అజ్ఞాతంగా అణగి ఉన్న భావాల్నీ, శక్తుల్నీ పైకి తీసుకొనివస్తే, నువ్వుకూడా పత్రికా ప్రపంచంలో ఒకనాడు ఉన్నత స్థానాన్ని ఆక్రమించగలవని నా దృఢనమ్మకం.

తద్వారా రచనా వ్యాసంగంలో పడి కొంత వరకూ నీ మనస్సును కలతపెట్టే ఆలోచనలకు దూరం కావచ్చు. ఇవి నే ననుభవంమీద చెప్తూన్న మాటలు."

మిత్రుని వచనాల్లో ప్రకాశరావుకి కొంత సత్యం గోచరించింది. అతడు చెప్పినట్లుగా తనెందుకు చెయ్యకూడదూ?...తన మస్తిష్కంలో మారుమూల అణగియున్న భావాలకు ఒక రూపాన్నిచ్చి వెలుగులోకి తీసుకొని వస్తే, హృదయం తేలికపడుతుందేమో! 'ఉన్నట్లుండి కలంపట్టుకుంటే రచయితవు కాగలవా?' అని అతని అంతరాత్మ అడ్డు తగిలింది. 'అందరూ పుట్టగానే పేరుమోస్తున్నారా?' అని సమాధానం చెప్పుకున్నాడు. తన తొలిప్రయత్నాలు విఫలమైనా తనకు ఖాతరు లేదు. విఫలయత్నాలే తనకు అనుభవాన్ని కల్గిస్తాయి. కృషి చెయ్యడం తన వంతు. ఆపైన అదృష్టాన్ని తీర్చిదిద్దేవాడు వేరే ఉన్నాడు.

ఆ రోజే తన నూతన ప్రయత్నానికి నాంది వాక్యం చదివేడు. రాత్రి ఆఫీసునుండి రాగానే భోజనం వగైరాలు ముగించుకొని కునుకుతూన్న కిరసనాయిలు దీపాన్ని పెద్దదిచేసి, కలం చేత పుచ్చుకుని కాగితాలముందు కూర్చున్నాడు. రాత్రి రెండుఝాములవరకూ మేల్కొని పూర్తిచేసిన తన తొలి రచనను చదువుకొనేసరికి అది తనకే వెగటనిపించింది. రచనలో పటుత్వం లేక చించి పోగుచేసిన నిష్ఫల యత్న చిహ్నాలు తన్నుచూసి పళ్లు యికిలిస్తున్నట్లు గోచరించింది. దానితో అతడు విసుగు చెందేవాడే కాని, సాయంత్రం తాను 'నిష్ఫల యత్నాలే అనుభవాని కాధారం' అని ధైర్యం చెప్పుకొన్న మాటలు జ్ఞాపకాని కొచ్చేయి.

ప్రతిరోజూ రాత్రి తొమ్మిది మొదలు, సగమురాత్రి గడచేవరకూ కథారచన చెయ్యడమతనికి కాలకృత్యమైపోయింది. కొన్నాళ్ల వరకూ అతని అన్ని రచనలకూ పత్రికలు స్వాగత మివ్వలేకపోయినా, కొన్నిరచనలపైనా మెచ్చుకొని ప్రకటించేవి. ప్రకటింపబడిన రచనలతనికి ప్రోత్సాహాన్నిచ్చేవి. ఆ ప్రోత్సాహం క్రొత్త రచనలకు దోహదమిచ్చేవి. ఇట్లా కొద్ది రోజుల్లోనే అతడు పత్రికా లోకంలో పరిచితుడై పోయాడు.

ఇప్పుడతని రచనలు ప్రకటించబడక పోవడం లేదనేకంటె, అతని రచనల్లో ప్రకటనార్హం కానిది లేదనడం సమంజసంగా ఉంటుంది. ఇది యిప్పుడతనికి మరొక విధంగా కూడా ఉపకరిస్తోంది. అతని రచనలకు తగిన విలువ కాకపోయినా, పత్రికాధిపతులు అప్పుడప్పుడు కృతజ్ఞతా పూర్వకంగా పంపే చిన్నచిన్న మొత్తాలతని చేతికి వచ్చేవి. తన్మూలకంగా యిప్పుడు తండ్రికి కొద్దిగానో గొప్పగానో డబ్బు పంపగలుగుతూన్నాడు. తన రచనా వైచిత్రిని చూసి ప్రజలు ముగ్ధులై హర్షించిన కొద్దీ అతనిలోని యేదో వాంఛ సారస్వతంలో యితోధిక కృషికి ప్రోత్సహించడం మొదలు పెట్టింది. తనకు కూడా శ్రమకు తగిన ఫలితం ఉన్నందున అతడా ప్రోత్సాహాన్ని నిరాకరించ లేదు.

ఈ కొద్ది కాలంలోనూ అతడు ఉత్తమ శ్రేణికిచెందిన రచనలను వ్రాయడానికి మేల్కొని శ్రమించిన రాత్రులు వేళ్లమీద లెక్కింపతగినవి కావు. పగలు తీరికలేక, రాత్రులు నిద్రలేక, అతని ఆరోగ్యం బాగా దెబ్బతింది. అతన్ని పరీక్షించిన డాక్టరు, నిద్రలేనివల్ల కల్గిన 'న్యూరాస్థినియా' అని రోగ నిర్ణయం చేశాడు. తగినంత నిద్రా, విశ్రాంతీ రోగికి ముఖ్యావసరాలుగా పాటించాలనీ, లేకపోతే చాలా ప్రమాదమనీ హెచ్చరించేడు. ఇప్పుడు ప్రకాశరావుకి మరొక సమస్య యెదురైంది.



తనీ మాసంలో జాగ్రత్త చెయ్యకలిగిన కొద్ది మొత్తాన్ని డాక్టరుకు ఫీజుక్రింద యివ్వడానికి మినహాయిస్తే యింక మిగిలే దేముంది?

అయితే తండ్రికి ఋణపడమెలా? మళ్ళా నిష్ఠురోక్తులతో నిండిన లేఖ రాకకోసం ఎదురు చూస్తూ ఉండవలసిందేనా? ఈ ఆలోచన లతని మనస్సును కొంతవరకూ కలవర పరిచాయనే చెప్పాలి. ఆ సమయంలో వెంకట్రావు వద్ద నుండి వచ్చిన ప్రోత్సాహకరమైన ఉత్తరం అతనికి కొంత ఉత్సాహాన్ని కల్గించింది. వెంకట్రావు తన రచనల్ని చదివినట్లూ, అవి చాలా ఉత్తమంగా ఉన్నట్లూ మెచ్చుకున్నాడు. ఒక సాహిత్య పరిషత్తువారు జరుపబోయే కథారచన పోటీలలో తనను పాల్గొనమనే సూచనకూడా ఉంది, ఆ ఉత్తరంలో. ఆ సూచనను అర్థం చేసుకున్నాడు, ప్రకాశరావు.

కథను వ్రాయడానికి భావసామగ్రిని కూర్చుకొనే సరికే కొన్నిదినాలు పట్టిం దతనికి. డాక్టరు చెప్పిన మాటలను మరచి, ఒకే దీక్షతో నడిరాత్రి దాటేవరకూ తన రచనల్లో మునిగి ఉండడంవలన అతనికి నరాల్లో పూర్తిగా బలహీనత వచ్చేసింది. నిల్చుంటే కాళ్ళువణికి కూలబడిపొయ్యే పరిస్థితికి వచ్చింది, అతని ఆరోగ్యం. కథలను పంపవలసిన నిర్ణీతదినం దగ్గరకొస్తున్నాది. కాని అతడు కలంపట్టే స్థితిలో లేడు. అంత వరకూ అద్భుతంగా తయారైన తన రచనను ఆ స్థితిలో వదలిపెట్టడానికి అతని మనస్సంగీకరించలేదు. ఇక నొక్కరాత్రి కూర్చుంటే దానిని పూర్తిచెయ్యవచ్చు ఎట్లాగైనా ఆ తన రచనను సంపూర్తిచేయ నిశ్చయించుకున్నాడు. అనుకున్నట్లే పూర్తిచేయగల్గేడు కూడా.

తాను వ్రాసినదాన్ని ముందతడు చదువుకొని తృప్తిపడితేనేగాని ప్రకటనార్థం పంపడం అలవాటులేని అతను మొట్టమొదటిసారిగా చదువుతూన్నప్పుడు తనే ముగ్ధుడు కాకుండా ఉండలేక పోయాడు. అతని రచన భావవైచిత్రిలో లోపం కనబర్చలేదు. పాత్రపోషణలో పటుత్వం తప్పలేదు. కల్పనాశక్తిలో కల్ల కనపర్చలేదు. ఇక ఉపసంహారం చదవడం పూర్తి చేయాలి. అంత రాత్రివరకూ మేల్కొనడంవల్ల అప్పటికే కళ్ళు జ్యోతుల్లా తయారయాయి! నరాల్లో పూర్తిగా శక్తి నశించింది. పటుత్వం తప్పిన చేతుల్లోంచి చదువుతూన్న కాగితాలు జారి క్రిందపడి, గాలికి రెపరెప కొట్టుకున్నాయి. కిరసనాయిలు అయిపోయిన దీపం ఒక్కసారి విజృంభించి ఆరిపోయింది. ఉదయాన్నే తెలివివచ్చిన తర్వాత కథను పోస్టుచేసి, చికిత్సకోసం ఆ దారిని అలాగే హాస్పిటలుకు వెళ్ళి అక్కడే చతికిలపడ్డాడు. డాక్టరు హాస్పిటల్‌లో చేర్చుకొన్నాడే కాని పెదవి విరువకపోలేదు.

* * *

"కథారచన పోటీలో ప్రథమ బహుమతి నందిన శ్రీ ప్రకాశరావుగారు కీర్తిశేషులైనందున దానిని తండ్రిగారైన మీకు పంపడమైనది. దీనితో జతచేసిన అయిదువందల రూపాయల బ్యాంకు చెక్కు, మీ కుమారుని తరఫున మీరు స్వీకరించవలెను."

ప్రకాశరావు తండ్రికి, తన కుమారుడి స్మృతిని జ్ఞప్తికి తెచ్చింది. తన కన్నీటిలో తడిసి కరిగిపోయిన చెక్కుమీది అలుక్కుపోయిన అక్షరాలు తన భావిజీవితాన్ని సూచిస్తూన్నట్లు తోచింది. తన కుమారుని జీవనజ్యోతి వలెనే ఖర్చయిపోయిన దీపంలాగా అంత్యక్షణాల్లో ఒక్కసారి విజృంభించి ఆరిపోయింది. చేతుల్లో నుండి జారిక్రిందపడిపోయిన బ్యాంకు చెక్కు ముందడుగువేసిన అతని పాదాల క్రిందపడి నలిగిపోయింది ప్రకాశరావు జీవితానికి మల్లే.

ఎవడైనా నాలుగుబాటల కూడలి దగ్గరికివచ్చి, అన్ని దారుల్లోంచీ ఒకేసారి నడవడానికి ప్రయత్నిస్తుంటే, అతడొక రాజకీయవేత్త అని తెలుసుకోండి